కథానిక

# పుట్టింటికి వెళ్ళిన ఇందిర

"శ్రీవిరించి"

రామనాధానికి ఎక్కడా వుద్యోగం దొరక లేదు. దొరికిందాకా అన్నగారు ప్రతి అయిదో తారీఖూ పంపే ముప్పైఅరూపాయిలే ఆధారం. ఆ ఆధారం గూడా యిపుడు తొలిగి పోయింది. ఆ అన్నగారు వుద్యోగంలో రవర్షను పొందాడు. పైనవచ్చే ఆదాయం తగ్గిపోయింది. అందువల్ల ఆయన యీ డబ్బు పంపటం మానేస్తానని రాశాడు. ఆ వుత్తరం రామనాధానికి పిడుగులాగా తగిలింది. ఆ వుత్తరంలో యింకో యీ ముక్కలున్నై—"నువ్వుద్యోగం లేకండా ఆర్నెల్లనించీ బెజవాడలో సంసారం చేస్తున్నావు. ఏవుద్యోగం దొరకనప్పుడు ఇంకా అవూళ్ళోనే వుండాల్సిన అవసరం కనిపించదు. నీకు బెజవాడ విడిచిపెట్టటం యెందుకు ఇష్టం లేదో నాకర్థంగావటంలేదు. నీకేం అభ్యంతరం లేకపోతే యీవూళ్ళో నాదగ్గరే వుండి నిశ్చింతంగా కాపరం చెయ్యొచ్చును. నేనూ నా వుద్యోగపు వ్యవహారాలన్నీ స్వయంగా చూచుకోలేకపోతోన్నాను. ఈ యేర్పాట్లవల్ల మనిద్దరికీ లాభమే వుంటుంది. నా ఆర్థిక వ్యవస్థలో దారుణమైన మార్పులు రావటంవల్ల యీ విధంగా వ్రాయవలసి వచ్చింది. అన్యధా భావించవొద్దు..." అన్యధా భావించటానికి మాత్రం యేముందిగనక! రామనాధం గుండె రాయి చేసుకుని ఆలోచించాడు. అక్కడికి వెళ్ళటంవల్ల తన ధీమాకేమీ తక్కువగాదు గాని-అసలు ధీమా తనకేం యేడ్చింది గనక!—తోటికోడళ్ళ మధ్యను పోట్లాటకు విరామం వుండదు.

అసలు రామనాధం మొదట్లో 'పెళ్ళి చేసుకోను' అనటానికి, కారణాలు యిలాంటివే! ఆ పెళ్ళిచేసుగని, ఓ పిల్లవాడిని కనటం వల్లనే గద్దా నలుగురిముందూ దేబిరించవలసి వచ్చింది తనిప్పుడు. కట్నం అనే ఆశ కలిగించజూచిన తలిదండ్రులూ, 'పెళ్ళిచేసుకోకండా వుండటం అదేం?' అన్న దగ్గరి దూరపు చుట్టాలూ ఇవాళ వొచ్చి తనని ఆదరించరేం? కడుపునిండా తన సంసారం వొకరోజు తృప్తిగా తింటానికి? లేదే! తను కష్టాలు పడటంలో అర్థం వున్నది. కాని ఎవరో ఒకమ్మ కన్న పిల్లని చేసుకుని, కష్టాలలో భాగం పంచటానికి తనకేం అధికారం వుంది, అడిగేవాడు లేడుగాని? తనకు ఇందిరని ఎందుకు యిచ్చారు? తన ముఖ సౌందర్యాన్ని చూచి యివ్వలేదు. అందం చూసి తనను యే హృదయంగల యువతీ వివాహానికి తొందరగా వొప్పుకోదని అతనికి తెలుసు. తన ప్రతిభ తెలివితేటలూ వినియోగించుకుని సంపాదించిన బి. ఏ. పట్టా చూచి ఇచ్చారు. అపుడు గొప్ప తెలివిగలవాడని తనని పొగడని వాళ్ళు లేరు. తనకేదో ఘనమైన భవిష్యత్తుందనీ, పేరు ప్రఖ్యాతులు తనకోసం ఎదురు చూస్తోన్నవనీ అనని వాళ్లు లేరు. కాని, యివాళ వాళ్లంతా యేమయ్యారు? ఒక్కరూ తనవంక చూడరేం? వాళ్లలో ఒక్కరికీ గుర్తు లేడా తను?

ఇంతకూ రామనాధాన్ని మరీ ఆశ్చర్యపరిచే విషయం ఏమంటే-ఇందిర గూడా తనని యీ నాడు మెచ్చుకోలేకపోవటం! తను చేసిన ప్రతి పనిలోనూ చెడుని యివతలకు లాగి తనని రోజల్లా దెప్పుతూ వుండటం పనిగా పెట్టుకొన్న ఈ ఇందిర నిజ స్వరూపాన్ని గురించి తనేం ఆలోచించుకున్నాడు—ఆవిడతో ముఖాముఖి పరిచయం ఏర్పడకముందు? తనకున్న ప్రతిదానికీ వ్యతిరిక్తంగానే జరుగుతూండటానికి తనేం చేయగలడు, ప్రతి క్రియ పరిస్థితులకు తల వొగ్గివుండటం తప్ప! అంతే అనుకున్నాడు రామనాధం.

కాని మనం చెప్పుకోదగ్గ మహత్తర గుణం రామనాధంలోని దేమనగా అతను గతించిన సంగతులకు పశ్చాత్తాప పడకండా ఎప్పుడూ ముందును గురించే ఆలోచిస్తూవచ్చాడు. కాని

అప్పుడప్పుడూ వెనకటి సంగతులు జ్ఞాపకంవచ్చి మనసుని ఆందోళన పరచటం, కొంత తూనిక అందు మూలంగా కోల్పోవలసి రావటం, తేరుకోటానికి కొంత కాలం వ్యయమవటం ఈ కాలం అంతట్లోనూ ఇందిర చెప్పే మాటలు నిజమే నేమోనని అనుమానం కలగటం జరుగుతూంది! సహన శక్తి బొత్తిగా లేకపోవటం ఇందిర తప్పు గాదనుకున్నాడు రామనాథం.

కర్తవ్యాన్ని వూహించటంలో అతనికి అణుమాత్రమూ సాయపడలేదు ఇందిర. పైపెచ్చు సాయపడటానికి నిరాకరించింది. ఏ మాటకామాట చెప్పుకోవలసివస్తే - యీ విషయం మినహా తతిమా వాటి అన్నింటిలోనూ ఇందిర అతనికి సాయం వొస్తుంది. అన్యోన్యానురాగం వుద్యోగం విషయంలో మాత్రం భేదిస్తుంది. ఇది చూచేవాళ్లకి కాస్త తమాషాగా కనిపించినా, వాళ్ళకు అలవాటే అయివుండాలి. మొదటి విషయం - రామనాథం బెజవాడ వొదల దల్చుకోలేదు. ఇందుక్కారణాలు అనేకం వున్నయ్. అవి చెప్పటానికి కుదరకపోయినా కొంతవరకు ముఖ్యమైనవే! రామనాథానికివి ప్రస్తుతావస్థనుంచి అవతల బడటానికి వుపయోగిస్తవనే ఆశ యేమూలనో వుంది. ఈ కారణాలు మరొకళ్ళకు అర్థంగాకుండా వుండి, వాళ్లకు యితనొక అమాయకుడో లేక యిట్లా వ్యర్థజీవితాన్ని ఆపేక్షిస్తున్న వాడోననే భ్రమని కలిగిస్తాయి. వివిధమయిన ప్రజాభిప్రాయాలకు ఆనాడు బాధ్యుడు కాలేదు. ఇంత కాలమూ తన కండగానిల్చిన అన్నగారి మాట వినకపోవటం వివేకం అనుపించుకోనదేమోనని అతనికి అనుమానం. అతనికి ఇందిర విషయమే అగోచరమవసాగింది. తనకేమీ ఆదాయం లేకండా వుండటం కంటకంగావుండి, అందుకు అంతులేకుండా సాధించినా, అనవసరమైన కర్చులకు పాకులాడకుండా వుండటమే గాక - అవసరాలను గూడా తగ్గించుకునే నేర్పు అలవరచుకుంది. ఇంట్లో వస్తువులకు కొద్దియిబ్బంది కలిగినా తనని యేమీ అనదు. ఏమనుకోవాలి, నవ్వాలా యేడవాలా అన్న సందిగ్ధావస్థలో పడ్డాడు. ఎంతగా ఆలోచించినా అన్నగారి యింటికి వెళ్ళటం అంత సబబుగా కనిపించలేదు అతనికి. ఎంత సొంత అన్నే అయినా యావజ్జీవమూ ఆయనమీదే ఆధారపడి నలుగురినోళ్ళలోనూ చౌక అయిపోవటం రామనాథానికి అవరోధించవలసిన అసందర్భంగానే కన్పించింది. దూరంగావుండి గుట్టుగా బ్రతకటానికి యింతవరకూవున్న అవకాశం యివాళతో లేకండా పోయింది.

రోజులు గడుస్తున్నయ్. కాని రామనాథం సంసారం గడవటం దుర్భరంగానేవుంది. ఇందిర దగ్గిర వున్న డబ్బూ అయిపోయింది, ఆ డబ్బు తింటూన్నన్నాళ్లూ రామనాథం ఆడవాళ్లుడబ్బు దాచుకుంటారని మనం అనుకుంటాం గాని, యిట్లా కర్చుచెయ్యగలిగితే వాళ్లకూ, ఆడబ్బుకు చరితార్థతదక్కినట్లే అనుకున్నాడు. అవకాశం కోసం ఎదురుచూస్తోన్న ధ్యానిలాగా, ఇందిర సాధిస్తోనే వుంది ములుకుల్లాంటి మాటలని. రామనాథం వాటిని గమనించకండా తిరగటం ఆవిడకు చిరాకే కలిగించింది-అందుకని అనడం మానెయ్యలేదుగాని.

తన బుర్రకెప్పుడైతే దుర్భరం అని తోచిందో అప్పుడే రామనాథం భార్యతో ప్రస్తావించాడు యీ విషయం. ఇందువల్ల ఏమీ ప్రతిఫలం వుండబోదని అతనికి తెలుసును. కాని యీ చర్చ అత్యవసరం అనీ, ఆవిడ అభిప్రాయం తను తెల్సుకోకండా వుండటం తప్పనీ భావించాడు. ఇందిర తన సొంత మాటలు నాలుగయిదు అన్నది. అవేవీ అతన్ని కలత పరచకపోగా అతనిట్లా అన్నాడు: “ఈ విషయంలో నన్ను నిందించి యేమీ లాభంలేదు. నా అసమర్థత నేనే తెలియపర్చుకుంటున్నాను గనుక. ఈగడ్డు పరిస్థితిలోంచి బయటపడటానికి సాధనోపాయాలు నీకేమైనా తోస్తే చెప్పు. వాటిని ఆచరణలో పెట్టటానికి నేజంకను” సూటి సమాధానంకోసం కొద్దిసేపు ఆలోచించి చివరకిట్లా అంది ఇందిర—“ఉపాయాలు నన్నా అడుగుతారు? ఎక్కడా వుద్యోగాలు దొరకవంటారు. రోజూ పేపర్లో అన్నన్ని పేజీలు-” మాట పూర్తి గాకండానే—“అవన్నీ మన కోసం గాదు” అన్నాడు. ఇందిరకి నిజంగా కోపం వచ్చింది. “ప్రాణాలు తీసుకోటం తప్ప మరోసాధనం నాకు కనిపించటంలేదు”. వెది

మలు వణుకుతూ వివేచనాజ్ఞానాన్ని కించితయినా వుపయోగించకండా తొందరపడి అన్నది ఇందిర. రామనాథం హేళనగా నవ్వి "ప్రాణాలు తీసుకోటం మాత్రం అంత తేలికనుకున్నావా? నువ్వీమాట అంటం యెవరైనా విన్నట్టయితే యీపాటికి మనం కారాగారానికి నడుస్తూండేవాళ్ళం" అన్నాడు. ధోరణి మార్చవలసిన అవసరాన్ని రామనాథం గుర్తించాడు.

"నాకో స్నేహితుడున్నాడు" అన్నాడు.

"ఎందుకు స్నేహితులంతా? చేత డబ్బున్నప్పుడు ఎగరేసుకు పోటానికి? కష్టకాలంలో ఆదరించేవాళ్ళు—"

"ఆగు... మనకు కష్టకాలం కానిదెపుడు? అనవసరంగా వాళ్ళమీద విరుచుకుపడిమాత్రం యేం లాభంవుంది? పూర్తిగా విను. అతనో వుద్యోగం చేస్తున్నాడు కాని దానిలో అతనికి తృప్తిలేదు. దాన్ని నాకు వొదిలి అతను యింకోటి చూచుకుంటానంటాడు. ఆ సంగతి ఏమయేదీ ఇంకో వారానికిగాని తేలదు. ఆ వారమూ మనం యిక్కడే వుండాలి. కదిలాహూ ఆశలేదన్న మాటే!"

"మరి యీ వారమూ గడపటం యెట్లా? నా దగ్గిరున్న దాంతో యింకా వొకటిన్నర రోజు గడుస్తుంది. తక్కిన కాలం... తీరా అదేదో కుదరక, ఎటన్నా పోవాల్సివస్తే చేతిలో రాగిదమ్మిడీ వుండదు... అయినా ఆ వుద్యోగం వొస్తుందని నమ్మకం లేదు గదా!"

"నాకుంది..."

"మీరట్లా అంటూనే వుంటారు. పోనీ అట్లాగే అనుకుందాం, ఎవరి దగ్గరైనా వో పాతిక బదులు తీసుకోండి... తర్వాత యివ్వొచ్చుగా!..."

ఈ వారం ఎట్లాగో గడిచేస్తే- అనే ఆశ రామనాథానికి పూర్తిగా వుంది. కాని అప్పెవరిస్తారు? అందరికీ తనే బాకీవుంటే! ఆశ ఓ మూలనించి బలంగా పీకుతూండటంవల్ల-అబద్ధాలాడి, అభిమానాన్ని చంపుకుని, పది రూపాయిలు సంపాయించాడు- అప్పుగా! కాని, వారమూ గడించింది- ఆశలు ఆడియాసలై పూరుకున్నై. ఆ స్నేహితుడు తన వుద్యోగం వొదులుకోలేదు. దానికి రామనాథానికి అంతు పట్టనంత వెనుక కథ వుంది. ఇది జరిగిన తర్వాత అతనికి బుర్ర పూర్తిగాతిరిగిపోయింది. ఇందిర తనలో యిటీవల యెక్కువైన కోపతాపాలు లోలోనే దిగమింగుకుని- అతనంటే యెంతో సానుభూతి వున్నట్లుగా నటిస్తోంది- ఈ నటనకంతకూ కారణం రామనాథాన్ని బెదరగొట్టకండా వుండాలన్న తలంపే! అవును. అతను పిచ్చివాడైపోతాడని ఆమె భయపడింది. కాని భార్యతో జరిపిన ప్రస్తావనలలో అతను అన్నగారి యింటికి వెళ్ళటాన్ని గురించి యెత్తలేదు. ఇందిరకూ యిది సుతరామూ యిష్టంలేదు. ఒక కుటుంబంలో దాదాపు తనకన్న యెక్కువ హక్కులు లేని స్త్రీ తనను-"నీ మొగుడికి వుద్యోగం లేదు. దిక్కుమాలిన వాళ్లయి మాయింట వొచ్చిపడున్నారు" అంటే తను సహింపగలదా! ఈ మాటపట్టింపులకే భయపడి రామనాథం అన్నగారింటికి వెళ్లటం కన్నా ఇందిర, పుట్టింటికి వెళ్ళటమే నయమని తీర్మానించాడు. పుట్టింటికి వెళ్లటాన్ని గురించి ముందు ఇందిరే యెత్తింది. "కొన్నాళ్లు మా యింటికి పోదాం. మా నాన్న మీకెక్కడైనా వుద్యోగం సంపాదించిపెడతాడేమో! పస్తులు పడుకోటం యేమంతొచ్చింది" అంది. "అంతకన్న మరో ఉపాయం లేనప్పుడు గదా!" అన్నాడు.

"ఏమున్న దేమిటి?" అంది ఇందిర లోని అభిమానాన్ని చంపుకుని.

"నువ్వెళ్లు" - రామనాథం ఆవిడ ముఖంలోకి గుచ్చి చూస్తో అన్నాడు: "మీ నాన్న యింటికి నువ్వెళ్లు. నేను యిక్కడే ఏ స్నేహితుల యింట్లోనో..."

తనొక్కతే వెళ్లటం ఇందిరకు నచ్చలేదు. "మిమ్మల్ని విడిచి నేనొక్కదాన్నీ వుండలేను. కొస్త కనిపెట్టేవాళ్లు లేకపోతే మీరో వారానికి యిట్లా వుండరు" అంది.

"ఫరవాలేదు. నువెళ్ళిపో. నాకోసం మీ వాళ్లు పిలవకపోయినా అభిమానం చంపుకుని నువ్వెళ్లు. నేనిక్కడ ఎట్లాగో వుండగలను! వుద్యోగం అవగానే రాస్తాను, వొద్దుగాని. నాకేం ఫరవాలేదు, బాబుని బాగాచూస్తోండు"

ఇందిరకు ఇది నచ్చకపోయినా తప్పలేదు. రామనాథం యీ విషయంలో బాగా ఆలోచించాడు. వాళ్ళకు తనంటే ఎంతో నిర్లక్ష్యం. తనంటే అభిమానం చూపే ఇందిర అంటేనూ నిర్లక్ష్యం-అంతా తన మూలానేగద! ఇందిర కొన్నాళ్ళపాటు పుట్టింట వున్నట్టు అవుతుంది. తను వాళ్ళని కష్టపెడుతూన్నాననే బెంగ తప్పుతుంది. కాని...ఇందిర మనసులోని నిప్పు చల్లారదు. దాని నార్పగల నీళ్ళు రామనాథం సమకూర్చుకో లేకు ఇన్నాళ్ళుగా బెజవాడలో వుంటున్నా. దూరంగా వుండి అతన్ని గురించి ఆలోచిస్తో కృశించటంలో వున్న శాంతిఏమిటి? ఎవరెంత వొద్దన్నా అక్కడ తనకు సర్వ హక్కులూ వున్నైగదా అనే ధీమాతో ఒప్పుకుంది ఇందిర.

ఒక్కళ్ళే రిక్షా తెచ్చి అందులో సామాను పెట్టించి, తను కూర్చున్న తర్వాత పిల్లాడిని అందిస్తోండగా అన్నది ఇందిర: "మీరూ ఓ రిక్షా చేసుగోరాదూ?" అని! రామనాథం నవ్వి వూరుకున్నాడు. రైలుస్టేషను అక్కడికి రెండు మైళ్ళకి తక్కువ వుండదు. కాని యీ దూరం రోజూ అతను తిరిగే దూరంలో ఎన్నోవంతో తెలియదా పిల్లకు. సాధారణ వేగంలో నడుస్తున్నది రిక్షా. ప్రక్కగా రామనాథం అనుసరిస్తున్నాడు.

రైలు కదలబోతోండగా అంది ఇందిర: "మళ్ళీ ఎన్నాళ్ళకో కలుసుకోవటం?" అని, కనుకొనల్లోంచి వొస్తూన్న నీటిని ప్రయత్న పూర్వకంగా ఆపుకుంటూ. "ఎన్నాళ్ళకోనా? నెల తిరక్కుండానే వుద్యోగం సంపాయించనా?" అన్నాడుగాని అతనికి అర్థం కాలేదు కర్తవ్యం.

* * *

మెల్లెక్కి వసారాలోకి వొచ్చి నించున్న తమ్ముడిని చూచి రామ్మూర్తి ఆశ్చర్యపడలేదు. "కూచో. పిల్లల్ని తీసుకురాలేదేం?" అన్నాడాయన. స్థిమితంగా మంచం వాల్చుకుని కూచుంటూ "అటుపంపా వాళ్ళని" అన్నాడు. "వాళ్ళనటుపంపి నువ్విటు వచ్చావన్నమాట?" అన్నాడాయన, తీవ్రంగా చూస్తో.

తాగటానికి మంచినీళ్ళు తెచ్చిచ్చి తలుపు పక్కగా నించుని వదినెగారు "మా చెల్లెలూ, పిల్లాడూ కులాసా?" అంది. "ఆ! ఈ పాటికి పుట్టింట్లో నలుగురిచేతా చీవాట్లు తింటూంటూరు" అన్నాడు రామ్మూర్తి, రామనాథంవంక అవహేళనగా చూస్తోనే! రామనాథం కంఠం బిగుతుచేసుకుని "నేనిక్కడ వుందామని వచ్చాను. నా పరిస్థితి నీకు తెల్సు. నాకో వుద్యోగం చూపించు, ఆఖరుకు జవాను పనయినా సరే" అన్నాడు. "ఏం, బెజవాడలో అలాంటిది దొరకలేదా నీకు?" అన్నాడు అన్న పూర్వపు ధోరణిలోనే.

నువ్వింకా నన్ను దెప్పిపొడిచి లాభంలేదు. పరిస్థితులు నన్నిట్లా తయారుచేసినై. పాతికపైన ముష్టి వుద్యోగం చాలునాకు" అన్నాడు.

"నీకా బెంగక్కర్లేదు. హాయిగా నాదగ్గరే వుండు వుద్యోగం అవసరంలేకండా గడిపేస్తాను." రామనాథం "నే నీవూళ్ళో వుద్యోగం లేకుండా వుండలేను నామాటవిను" అన్నాడు. రామ్మూర్తి అతని ధోరణిని సరిగా అర్థం చేసుకోలేను. "నీ కీవూళ్ళో వుద్యోగం యెక్కడ దొరుకుతుంది, బెజవాడ లోనే దొరకంది?" అన్నాడు 'బెజవాడ' నొక్కినొక్కి.

"నువ్వేదో చూపిస్తావని వచ్చాను" అన్నాడు రామనాథం, బలవంతాన.

ఇంతలో భోజనాల పిలుపు వొచ్చింది. రామ్మూర్తి "ముందు భోజనానికి లే, తర్వాత ఆలోచిద్దాం" అన్నాడు. రామనాథం ఛటుక్కున "నాకప్పుడే ఆకలిలేదు. ఐనా యీ విషయం తేలితేగాని నేనేమీ చెయ్యలేను" అన్నాడు.

"నీ అనుమానాలు నాకు తెలుసు. అయితే నువ్వే నావుద్యోగం చెయ్యి. నేను నీ పోషణలోనే వుంటాను" అన్నాడు రామ్మూర్తి. రామనాథం అన్న అందించిన ఇస్త్రీ ధోవతీ పుచ్చుకున్నాడు.

ఇంత తేలిగ్గాను, తమాషాగాను యీ వ్యవహారం పరిష్కారం అవుతుందని రామనాథం అనుకోలేదు. తీరిగ్గా భోజనాలయిన తర్వాత 'పుట్టింటికి వెళ్ళిన ఇందిర'కు వుత్తరంరాశాడు, వెంటనే బయల్దేరి రమ్మని!